బలహీనతలు కొనసాగొచ్చు



సెన్సెక్స్ విశ్లేషణ

డిసెంబరు 30తో ముగిసిన వారానికి

సమీక్ష : గత వారం సెంటిమెంట్ బలహీనపడటంతో మార్కెట్ నష్టాలతో ముగిసింది. అంతర్జాతీయంగా వెలువడిన ఆర్థిక గణాంకాలు ఆశావహంగా లేకపోవడం.. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపును దృష్టిలో ఉంచుకుని మదుపర్లు పొజిషన్ల నుంచి బయటపడడం, రూపాయి మారకపు విలువ పతనం వంటి కారణాలు మార్కెట్ తగ్గడానికి కారణం అయ్యాయి. అమెరికా ఆర్థిక గణాంకాలు మెరుగ్గా ఉండగలవన్న అంచనాలతో మార్కెట్ లాభాలతో ప్రారంభమైంది. తర్వాత ఒడుదొడుకులతో సాగింది. సెన్సెక్స్ 284 పాయింట్ల నష్టంతో 15,455 పాయింట్ల వద్ద ముగిసింది.

ఎఫ్ఐఐల తీరు : గత వారంలో ఎఫ్ఐఐలు నికరంగా రూ.342 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 2011 ఏడాదికి రూ.2,714 కోట్ల నికర అమ్మకాలు జరిపారు. మ్యూచువల్ ఫండ్‌లు గత వారానికి రూ.305 కోట్లు, ఏడాది మొత్తానికి రూ.5,956 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు.

ఏడాది చివరకు లాభపడిన, నష్టపోయిన షేర్లు 1:1 నిష్పత్తిలో ఉండడం మార్కెట్‌లో సాధారణ బలహీనతలు కొనసాగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఎంపిక చేసిన షేర్లలో దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు జరిగాయి.

భవిష్యత్ అంచనా : మధ్య కాలానికి సెన్సెక్స్ 14,000 పాయింట్ల వరకూ తగ్గే అవకాశం ఉంది. ఈ స్థాయికి పైన కొనసాగడంలో విఫలమైతే.. 12,500 పాయింట్ల వరకూ పతనం కావచ్చు. స్వల్పకాలానికి సెన్సెక్స్ 16,069 పాయింట్ల పైన కొనసాగే జోరు మార్కెట్‌లో రికవరీని సూచిస్తుంది. ఒకవేళ 15,425 పాయింట్ల దిగువకు చేరితే.. మళ్లీ 15,136 పాయింట్ల స్థాయిని తాకే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాదిలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 19 శాతం క్షీణిస్తే.. ముడి చమురు ధర 14 శాతం పెరిగింది. అధిక ముడి చమురు ధరలు, రూపాయి పతనం ఇలానే కొనసాగితే.. ఈ ఏడాదిలో (2012) కూడా మార్కెట్ క్షీణపథంలోనే పయనించవచ్చు. అంతర్జాతీయ మందగమనం నేపథ్యంలో చమురు, ఇతర కమోడిటీల ధరలు తగ్గితే.. భారత వృద్ధిరేటుకు అది ఊతం కాగలదు.

ప్రభావిత అంశాలు : స్వల్ప కాలానికి త్రైమాసిక ఫలితాలు, బడ్జెట్, ద్రవ్య, వాణిజ్య లోట్లు, రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల ఫలితాలు, విధానపరమైన సంస్కరణలు, వడ్డీరేట్ల తగ్గింపు అవకాశాలు తదితరాలపై మార్కెట్ దృష్టి కేంద్రీకరించే వీలుంది. సానుకూల పరిణామాలు చోటు చేసుకుంటే.. అవి మార్కెట్ కోలుకోవడానికి ఉత్ప్రేరకాలు కావచ్చు. ప్రతికూల పరిణామాలు చోటు చేసుకొంటే మార్కెట్ మరింత తగ్గుతుంది.

తక్షణ నిరోధ స్థాయిలు: 15,750, 16,069, 16,383; తక్షణ మద్దతు స్థాయిలు: 15,136, 14,684, 14,000.

మార్కెట్ రికవరీ దిశగా అడుగులు వేసినా.. బలహీనతలు కొనసాగే వీలుంది.

– సతీశ్ కంతేటి, జెన్‌మనీ